# తొలినుడి

వేదాలతో మొదలుకొని స్మృతులు, పురాణాలు, మంత్రశాస్త్రాలు, స్తోత్రాది వాఙ్మయ సర్వస్వం... ఇవన్నీ కలిపి సనాతన ధర్మానికి ఆలంబనాలు.

వాటిలోని శాశ్వత విలువలను ఎప్పటికప్పుడు స్మరించుకుంటూ, ఆయా దేశ కాలాలకు అనుగుణంగా సమన్వయించుకుంటూ సాగినపుడే మన జీవితాలకు సాఫల్యం.

సనాతన ధార్మిక వచనాలను 'ఇవేవో జీవితాలకు అతీతమైన మాటలు' అని త్రోసిపుచ్చటం పరిపాటి. కానీ అవి జీవితాన్ని సరిగ్గా నిర్వచించి జీవింప జేసే అక్షరసత్యాలు. ఈ సత్యాన్ని చాటడానికి చేసిన చిన్న ప్రయత్నమిది.

మానవుడనే వాడికి పనికి వచ్చే మంచి మాటలను, మన శాస్త్రోద్యానాల నుండి శక్తి కొద్దీ ఏరి, నా పరిమితబుద్ధి కొద్దీ సంభావించి సమకూర్చిన జ్యోతిర్మణి మాలిక ఇది.

ఇందులో కొన్ని ఆయా పర్వదినాలను, ప్రత్యేక తిథులను పురస్కరించుకొని వ్రాసినవి. అవి కూడా మన ఆర్షహృదయాన్ని ఆవిష్కరిస్తాయని వీటిలో పొందు పరచడం జరిగింది. ఒకే అంశంపై వివిధ సందర్భాలలో వ్రాయడం చేత, ఎడనెడా పునరుక్తి వలె కనిపించినా, సమయాంతరాన్ని అనుసరించి రచించడం చేత అది అనివార్యం. కనుక వాటిని యథాతథంగానే ఇందులో ప్రచురించడం జరిగింది.

ప్రముఖ దినపత్రిక 'ఈనాడు'లో అంతర్యామి శీర్షికలో, నది మాస పత్రికలో ప్రచురితమైన నా రచనలన్నింటినీ ఈ పుస్తకం రూపంలో సమర్పించుకుంటున్నాను. ఇది వెలుగుచూడాలనే ఆసక్తితో కొంతమేరకు ఆర్థికంగా సహకరించిన సహృదయులు శ్రీ కె.వేంకటేశ్వరరావు గారికి (హైదరాబాదు) శతథా కృతజ్ఞతాభి వందనాలు.

దీనిని చదివి వాత్సల్యంతో ఆశీర్వదించిన మహాత్ములు 'మహామహోపాధ్యాయ' ఆచార్య పుల్లెల శ్రీరామచంద్రుడుగారికి ప్రణామశతాలు.

ముఖ్యంగా నేటి యువత దీనిని చదివి సంప్రదాయ విలువల సార్థక్యాన్ని స్ఫూర్తిగా గ్రహిస్తే- ఈ ప్రయత్నం నెరవేరినట్లే.

స్వస్తి.

-సామవేదం షణ్ముఖశర్మ